
లింగాకారంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

## ఘనంగా కార్తీక దీపోత్సవం

**వర్గల్, నవంబరు 20(ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో 19వ రోజు బుధవారం దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో లింగాకారం లో ఏర్పాటు చేసిన దీపాలను భక్తులు భగవన్నామ స్మరణచేస్తూ వెలిగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రప్రభు త్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు కార్తీక మాసం దీపోత్సవాన్ని 19 రోజులుగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం లో సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రాష్ట్రానికి ఏం చేశారని విజయోత్సవ సభలు

### -బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, నవంబరు 20 (ప్రభాతవార్త):** రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి ఏం చేశా రని విజయోత్సవ సభలు జరుపుకుంటున్నారో ప్రజలకు చెప్పాలని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అబద్ధపు, అసత్యపు ప్రచారాలతో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఫార్మా పేరుతో రైతులపై అక్రమ కేసులు పెడుతున్నందుకా లేక ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు విజయోత్సవాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. విజయోత్సవ సభలో రేవంత్‌రెడ్డి పిచ్చి కూతలు కూస్తున్నారని అన్నారు. పదేండ్ల కెసిఆర్ పాలనలో రాష్ట్రం అద్భుతంగా పురోగమించిందన్నారు. ఏ ఊరికి వెళ్లినా కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమం కనిపిస్తుందన్నారు. కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా అని అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.


బాలికల పాఠశాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

### గురుకుల పాఠశాలల్లో

## వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

### సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్

**రాయికోడ్, నవంబరు 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులోని సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను బుధవారం సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పాఠశాలకు చేరుకున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిసరాలను, లైబ్రరీని, కంప్యూటర్ గదిని, విద్యా బోధన, వంటశాలలను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ప్రిన్సిపాలకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జగదీష్, ప్రిన్సి పల్ ప్రేమలత, ఆర్ఐ రామచందర్, కార్యదర్శి శివశంకర్, సత్తయ్య ఉన్నారు.

## టెలికం బోర్డు సభ్యుడిగా అంబటిపల్లి శ్రీనివాస్


శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంపి రఘునందన్‌రావు

**సిద్దిపేట రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** సిద్దిపేటకు చెందిన బిజెపి నాయకులు అంబటిపల్లి శ్రీనివాస్ టెలికం బోర్డు మెంబరుగా నియమితులయ్యారు. ఈ మేరకు మెదక్ ఎంపి రఘునందన్‌రావు చేతులమీదుగా బుధవారం నియామకం పత్రాన్ని అందుకున్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని ఎంపి రఘునందన్‌రావు ఈ సందర్భంగా తెలిపారు. తన నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డితో పాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు అంబటిపల్లి శ్రీనివాస్ తెలిపారు.

## ఓటమి.. గెలుపునకు నాంది కావాలి

### జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న డిఈఒ శ్రీనివాస్‌రెడ్డి

**కొండపాక, నవంబరు 20, ప్రభాతవార్త :** ఓటమి చవి చూసినపుడే గెలుపునకు మరింత పట్టుదలతో కృషిచేస్తామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపాక బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విఠల్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలన్నారు. అనంతరం జాతీయ, రాష్ట్రస్థాయిలో సహ పాఠ్యంశాలలో జరిగిన వివిధపోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి పోటీల్లో అయినా గెలుపొందుతారన్నారు. విద్యతోపాటు ఆటలు, పాటల్లోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, హారతి, రామస్వామి, మహేందర్‌రెడ్డి, కనకయ్య, బాలమల్లయ్య, సత్యలక్ష్మి, రాకేష్, రదీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

**సంగారెడ్డి బ్యూరో నవంబరు 20,ప్రభాతవార్త:** ఈ నెల 21, 22 23 తేదీలలో జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ అవార్డుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు డిఇఒ వెంకటేశ్వర్లు తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక సెయింట్ ఆంటోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈసంవత్సరం జరగబోయే వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి 11 కమిటీలను నియమించడం జరిగిందని, అన్ని యాజమాన్యాల పాఠశాలలు కలిపి సుమారు 850 వరకు ఎక్స్ బిట్స్ ప్రదర్శనకు వస్తాయని, ఇన్స్పైర్‌కు 95 ఎగ్జిబిట్ వస్తాయన్నారు. ఈ సంవత్సరం ప్రధాన అంశంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశానికి అనుబంధంగా ఏడు ఉపాంశాలతో జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఇందులో 1. రవాణా కమ్యూనికేషన్ 2. వ్యర్థాల నిర్వహణ 3. ఆహారం ఆరోగ్యం మరియు పరిశుభ్రత 4. సహజ వ్యవసాయం 5. విపత్తుల నిర్వహణ 6. గణిత నమూనాలు, గణన ఆలోచనలు 7. వనరుల నిర్వహణ లాంటి ఉప అంశాలు ఉంటాయని తెలిపారు.సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మాజీ సైన్స్ అధికారి విజయ్‌కుమార్, నోడల్ అధికారి లింభాజీ, సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్, కోహిర్ మండల విద్యాధికారి, ప్రింట్ అండ్ మీడియా కన్వీనర్ జాకీర్ హుస్సేన్, కో కన్వీనర్ భాస్కర్, ప్రిన్సిపల్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వర్లు

# ఆయిల్ ఫాం సాగుతో రైతులకు అధిక లాభాలు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లాలో ఆయిల్‌ఫాం సాగుకు అవకాశాలు చాలా ఉన్నాయని రైతులను ఒప్పించి ఆయిల్‌ఫాం సాగుకు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయిల్‌ఫాంసాగుపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగుకు అనేకమైన అనుకూల అంశాలు ఉన్నాయన్నారు. ఆయిల్ ఫాం సాగుతో రైతులు అధిక ఆదాయం పొందడమే కాకుండా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించవచ్చునని తెలిపారు. నంగునూర్ మండలం నర్మెటలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం సులభం అవుతుందన్నారు. రైతులకు అవగాహన కల్పించి అయిల్‌ఫాం తోటలను సాగు చేసేలా చూడాలన్నారు. అయిల్‌ఫాం లక్ష్యం చేరడంలో నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సందర్శిస్తూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాధక, ఏడిఎలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో పరిశుభ్రత లోపిస్తే అధికారులపై చర్యలు

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి


కలెక్టరేట్‌లోని పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి బ్యూరో నవంబరు 20,ప్రభాతవార్త:**
కలెక్టరేట్‌లో పరిశుభ్రత లోపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యల తప్పవని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లో పరిశుభ్రతపై చర్యలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణం మొత్తం తిరిగి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టరేట్ సముదాయం లోని వివిధ శాఖల అధికారులతో పరిశుభ్రతపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో పరిశుభ్రత లోపిస్తే సంబంధిత శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రజల కోసం తాగు నీరు కోసం ఫిల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగే సమావేశాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఆదేశించారు. పరిశుభ్రతపై ప్రతి అధికారి బాధ్యత వహించాలన్నారు. శాఖల కార్యాలయాల వద్ద పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంకు వచ్చే వాహనాలు క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏఓ పరమేష్‌ను ఆదేశించారు. ప్రైవేట్ వ్యక్తులు తమ వాహనాలను అధికారిక పార్కింగ్‌లో పెట్టకుండా చూడాలని సెక్యూరిటీస్ సిబ్బందికి ఆదేశించారు. అధికారులు తమకుకేటాయించిన వాహనాలను కేటాయించిన పార్కింగ్‌లోనే నిలుపుకోవాలి అని సూచించారు. అధికారిక వాహనాలకు స్టిక్కరింగ్లు ఏర్పాటు చేయాలి చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల తర్వాత కలెక్టరేట్లో ప్రవేశించే వాహనాలకు స్టిక్కర్లు, సిబ్బందికి ఐడికార్డు ఉంటేనే కలెక్టరేట్ కార్యాలయంలోకి అనుమతించాలి అన్నారు. నో పార్కింగ్ జోన్ లో వాహనాలు పెట్టి వెళ్లిపోతే జరిమానా విధించాలని ఏవోను ఆదేశించారు. కలెక్టరేట్‌చుట్టూ అన్నికోణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిఆర్ఓ పద్మజారాణిని ఆదేశం చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డి ఎస్ సత్తియ్యగౌడ్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

### జడ్‌పి సిఇవో ఎల్లయ్య

**పెద్దశంకరంపేట, నవంబరు 20 ప్రభాతవార్త:** మెదక్ జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాల నమోదును జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వే ఫారాలను క్షుణ్ణంగా నింపే విధానాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు వెళ్ళాల్సిన బాధ్యత ఉందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఫారాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. సర్వే లక్ష్యాలు నెరవేర్చే బాధ్యత ఎన్యుమరేటర్‌లదే అని చెప్పారు. ఎన్యూమరేటర్‌లు సర్వేలో క్వాలిటీ తో పాటు క్వాంటిటీని కూడా ఫోకస్ చేసుకుంటూ ఇంకా జరుగబోయే రోజుల్లో కూడా ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూసుకోవాలన్నారు. సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని బ్లాక్‌లలో ఎన్యూమరేటర్‌ల ద్వారా సర్వే ప్రక్రియ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు సరైన సమాచారాన్ని ఇచ్చి సర్వే సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఈవో వెంకట్ రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**అక్కన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** రైతులు కొనుగోలు కేంద్రా లను సద్వినియోగం చుసుకోవాలని ఎపిఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రామవరం ఐకెపి కొనుగోటు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో ఉన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇప్పటి వరకు అక్కన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న 8 సెంటర్లలలో 249 మంది రైతుల నుండి 11,378 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిసి శివ చరణ్‌సింగ్, సీఎ స్వరూప, రైతులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

## రైతులకు అసౌకర్యం కలిగించొద్దు

### -మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 20 ప్రభాతవార్త:** రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా లారీలలోఉన్న ధాన్యాన్ని తొందరగా దిగుమతి చేసుకోవాలని మెదక్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమాదేవి మిల్లర్స్ యాజమాన్యాన్ని ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆర్డీవో రమాదేవి హవేలీ ఘనపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా గాయత్రి రైస్‌మిల్‌ను పరిశీలించి ధాన్యం లారీలు దిగుమతులకు సంబంధించి ఎక్కువ మంది హమాలీలను పెట్టుకుని ధాన్యం తొందరగా దిగుమతి చేసుకోవాలని, రైతులు ఎంతో కాయ కష్టం చేసి వరి పండించి ప్రభుత్వం ద్వారా కొనుగోలు జరిగితే మద్దతు ధర వస్తుందని సదుద్దేశంతో ఉంటారని, మిల్లర్స్ యాజమాన్యం రైతులు ఎవరికీ అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. ధాన్యం దిగుమతులలో వేగం పెంచాలని సూచించారు. అనంతరం కూచన్‌పల్లి సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించి, ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వేఫారాలను క్షుణ్ణంగా నింపే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సమగ్ర కుటుంబసర్వే ఫారాలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.

# ఆటో డ్రైవర్లకు సురక్షితం 'అభయ యాప్'

### సిపి డా॥ అనురాధ



అభయ యాప్ స్టికర్‌ను అందజేస్తున్న సీపీ డా॥అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ప్రయాణీకుల రక్షణ దృష్ట్యా సిద్దిపేట జిల్లా కేంద్రంలో 1250 ఆటోలకు అభయ యాప్ స్టిక్కరింగ్ చేయడంజరిగిందని సీపీ డాక్టర్ అనురాధ అన్నారు. సీపీ కార్యాలయంలో బుధవారం అభయ యాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. త్వరలో పూర్తి స్థాయిలో ఆటోలకు స్టిక్కరింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి ఆటోకు అభయ క్యూఆర్ కోడ్ తప్పకుండా అతికించాలన్నారు.అభయ యాప్ పై ఆటోలో సేఫ్ అనే క్యూఆర్ కోడ్‌ఉన్న స్టిక్కర్‌ను డ్రైవర్ వెనుక సీట్‌కు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆటోలో సురక్షితంగా ప్రయానిస్తున్నామని నమ్మకం ప్రయాణీకులకు కల్పించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఎంతైనా ఉందని చెప్పారు. ఆటోలో ప్రయాణం చేసే మహిళలు ప్యాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్ వివరాలు నెంబరుతో యుక్తంగా వస్తాయని... ఆటోలో ఏదైనా విలువైన వస్తువులు మరిచిపోతే వెంటనే ఆటోను ట్రేస్ అవుట్‌చేసి అప్పగించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఆటో డ్రైవర్లు ఏదైనా నేరాలకు పాల్పడిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన సీసీ కెమెరాల ద్వారా కూడా క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని.. ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులను తీసుకెళ్లడం సరికాదన్నారు. అభయ యాప్ ఆటో డ్రైవర్లకు సైతం సేఫ్‌గా ఉంటుందన్నారు. అభయ యాప్ రూ.50తో ప్రమాదవశాత్తు మరణానికి రూ.లక్ష బీమా లభిస్తుందన్నారు. జిల్లాలోని ఆటో డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ అభయ యాప్ స్టిక్కర్ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు మధు, ప్రవీణ్‌కుమార్, మురళి, నర్శీధర్, శ్రీధర్ గౌడ్, విద్యాసాగర్, శ్రీను, మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.


సమగ్రసర్వే పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

## సజావుగా సాగుతున్న సమగ్ర సర్వే

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో నవంబరు 20,ప్రభాతవార్త:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సజావుగా సాగుతుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారని, ప్రస్తుతం జిల్లాలో 75 శాతం పూర్తయిందని ఆమె చెప్పారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని 32 వార్డుల్లో సర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా, కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర ఇంటింటి సర్వే ముఖ్య ఉద్దేశం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికి అవసరమైన వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగు పరిచేందుకు సరైన ప్రణాళికలు రూపొందించడమని తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధివంటి రంగాల్లో ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేసి, వారికోసం ప్రభుత్వం తగిన కార్యక్రమాలు రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్వే ద్వారా ప్రభుత్వానికి సమగ్రమైన డేటా లభిస్తుంది, తద్వారా నూతన ప్రణాళికల రూపకల్పనకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలనే సంకల్పంతో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్, తహసీల్దార్ దేవదాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. నేటి నుండి సంగారెడ్డిలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన.

## ప్రాణం తీసిన వరి కొయ్యలకు నిప్పు

**కోహెడ, నవంబరు 20, ప్రభాతవార్త :** పొలంలోని వరి కొయ్యలు నిప్పు ఓ రైతు ప్రాణాలను తీసింది. ఈ విషాదకర సంఘటన కోహెడ మండలం తంగళ్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన రైతు లెంకల రాజయ్య(57) గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలో వరి కొయ్యలు కాల్చేందుకు నిప్పు పెట్టినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు రాజయ్య మంటల మధ్యలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు.

## నర్సాపూర్‌లో ఎండు గంజాయి పట్టివేత


గంజాయి తరలిస్తున్న నిందితుడిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

**నర్సాపూర్, నవంబరు 20, ప్రభాతవార్త :** ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎండు గంజాయిని పట్టుకున్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్సాపూర్ హైదరాబాద్ రోడ్డు మార్గంలోగల అర్బన్ పార్క్ వద్ద ఎండు గంజాయి తరలిస్తున్నట్టు నమ్మదగిన సమాచారం మేరకు నర్సాపూర్ ఎక్సైజ్ సిఐ పద్మా ఆధ్వర్యంలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నర్సాపూర్ పట్టణానికి చెందిన షాహిద్ ఖాన్ సుజుకి యాక్సిస్ స్కూటీలో ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు పట్టుబడిన నిందితుడి నుంచి 104 గ్రాముల ఎండు గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎండు గంజాయి తరలిస్తున్న మాదక ద్రవ్యాల అక్రమరవాణా చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ పద్మ తెలిపారు. తనిఖీల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ పద్మ, ఎక్సైజ్ ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు

### అనారోగ్య కారణాలతో ఎంబిబిఎస్

## విద్యార్థి ఆత్మహత్యాయత్నం : ఏసిపి మధు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 20, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలోగల సురభి మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ మొదటి ఏడాది చదువుతున్న గాయత్రి అనారోగ్య కారణాలతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిందని సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. బుధవారం ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 11న గాయత్రి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలో చేరినట్లు తెలిపారు. గాయత్రి ఓసిడి అనే మానసిక వ్యాధితో బాధపడుతుందన్నారు. గాయత్రి డిప్రెషన్ కారణంగా ఒత్తిడి తట్టుకోలేక సూసైడ్ లేటర్ రాసి హాస్టల్ గది మొదటి అంతస్తు నుంచి ఈనెల 17న కిటికీలో నుంచి కిందకు దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడి కుడి కాలుకు గాయమైనట్లు తెలిపారు. కాలేజీ యాజమాన్యం అమ్మాయి తల్లిదండ్రులకు తెలపగా గాయత్రిని తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారని విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కాగా త్రీ టౌన్ పోలీసులు కాలేజీని సందర్శించి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. కాలేజీ యాజమాన్యాన్ని, తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు.


వివరాలను వెల్లడిస్తున్న ఏసిపి మధు


గాంధీ విగ్రహాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## హుస్నాబాద్‌లో గాంధీ విగ్రహం తొలగింపు

### భద్రపరచిన మున్సిపల్ అధికారులు

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త:** పట్టణంలోని గాంధీ చౌరస్తా సుందరీకరణ పనుల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది గాంధీ విగ్రహాన్ని తొలగించారు. ఈ విగ్రహాన్ని 1958లో ఏర్పాటు చేయగా 66 ఏళ్ల తర్వాత తొలగించినా విగ్రహం చెక్కు చెదరలేదు. తీసిన విగ్రహాన్ని ట్రాలీఆటోలో మున్సిపల్ కార్యాలయానికి తరలిచి భద్రపరచారు. అయితే ఇటీవల ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. రహదారి సందరీకరణ పనులు పూర్తయిన తర్వాత గాంధీ విగ్రహాన్ని తిరిగి అదే స్థానంలో ఆవిష్కరించనున్నారు.

## గిరిజన రైతుల భూములు లాక్కోవడం సిగ్గుచేటు


అరెస్ట్ అయిన గిరిజన నాయకులు

**అక్కన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మసిటీ ఏర్పాటు చేస్తామనే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద గిరిజనుల భూములు లాక్కోవడం సిగ్గుచేటని గిరిజన నాయకులు నునావత్ మోహన్‌నాయక్ మండిపడ్డారు. బుధవారం గిరిజన భూములు లాక్కోవద్దని డిమాండ్‌తో రైతులకు మద్దతుగా వెళ్లి ఆందోళనలు చేపడతారనే భయంతో గిరిజన నాయకులను ప్రభుత్వం అరెస్టు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ భూముల విషయంలో మాట్లాడే ప్రతీ ఒక్కరిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసుల పాలుచేస్తోందన్నారు. అమాయకుల భూములు లాక్కుని వారిని రోడ్డున పడేయాలని చూస్తున్న ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే ఎన్నికలముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంపై ఆలోచన చేయాలని హితవు పలికారు. అరెస్ట్ అయిన వారిలో గిరిజన నాయకులు రైనానాయక్, సంతోష్‌నాయక్, కృష్ణనాయక్, సేవాలాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## మోసాల పుట్ట ధరణి పోర్టల్


కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, నవంబరు 20, ప్రభాతవార్త :** ధరణి ఒక మోసాల పుట్టగా తయారై రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ సతారి స్వామి ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో రెవెన్యూ చట్టం సవరణలు, భూ సంస్కరణల కేంద్రంగా జరపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి జిల్లా నాయకులు కీసరి ఎల్లం ఆధ్వర్యంలో డిసెంబరు 9న హైదారాబాద్‌లో జరిగే రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో విసిరి పారేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం భూమాత పేరుతో అదే ధోరణి అవలంభించడం సరికాదన్నారు. రెవెన్యూ సంస్కరణలను భూ సంస్కరణలతో జోడించి రూపొందించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర సదస్సులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టియుఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మేకల రాములు, రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లం, మల్లుపల్లి ఎల్లం, మల్లేశం, గోర్ల ప్రభాకర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


ముదిరాజ్ మహాసభ వాల్ పోస్టర్‌ను అవిష్కరిస్తున్న దృశ్యం

**కొండపాక, నవంబరు 20, ప్రభాతవార్త :** ముదిరాజ్ మహాసభ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మత్స్యకారుల దినోత్సవం రోజున పెద్దఎత్తున నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు జిర్ర రాజు, యువజన విభాగం అధ్యక్షుడు సున్నం భాస్కర్, మత్స్యశాఖ డైరెక్టర్ చిలుముల నరహరి కోరారు. ఈ సందర్భంగా బుధవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాద్ది ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద అవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో ముదిరాజ్‌లు అత్యధిక సంఖ్యలో ఉన్నరని, మనమంత ఎకతాటిపై ఉంటే ఎదైనా సాధించుకొగలమని సూచించారు. కార్యక్రమంలో మిద్దే శివకుమార్, నాగరాజు, స్వామి, దర్గయ్య, కనకయ్య, నర్సింలు, ఉపేందర్, కాట కిష్టయ్య, అంకుష్, భాస్కర్, నీతి పాండు, నరేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** విద్యార్థులు సామాజిక మ్యాద్యమాలకు దూరంగా ఉండడంతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ మణమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు షీటీం సిబ్బందితో కలసి సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళలకు చట్టాలు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, సామాజిక మాద్యమాలు వాటి ప్రభావం, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, మహిళా రక్షణ, సెల్ఫ్ డిఫెన్స్, విద్యార్థి చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, సీసీ కెమోరాల వినియోగం, ఈవిటీజింగ్, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు అభద్రతాబావానికి లోనుకాద్దని, ఎలాంటి సమస్య వచ్చినా ఎదిరించి నిలుచోవాలన్నారు. వారికి ఎవరివల్ల ఇబ్బందులు కలిగినా 100, 8712 667434 ఎమర్జెన్సీ నంబర్‌లకు సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, షీటీమ్ బృదం సదయ్య, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ మణమ్మ

# ఉద్దేశపూర్వకంగానే మాపై ఆరోపణలు

**నర్సాపూర్ నవంబరు 20, ప్రభాతవార్త:** చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు చేశారని, అదేవిధంగా కేసులో ఎఫ్ఐఆర్‌లో నమోదైన వ్యక్తి విచారణలో చనిపోయాడని నిర్ధారణ అయితే అట్టి పేరును తొలిగించడం జరుగుతుందని సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం వెల్లడించారు. బుధవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 23.9.24న ఇమ్మడి శ్రీనివాస్ అనే వ్యక్తి నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామశివారులో మూడు ఎకరాల 5గుంటల భూమి ఉంది. ఆ భూమిని 2011 సంవత్సరంలో తండాకు చెందిన వారి వద్ద ఇమ్మడి శ్రీనివాస్ కొనుగోలు చేశారు. ఆ భూమిలో లచ్చిరాం తండాకు చెందిన పాతులోత్ దేవిసింగ్, సూర్య ఆంజనేయులు, విటల్ అక్రమంగా కబ్జా చేశారని ఫిర్యాదుదారుడు పేర్కొన్నారని తెలిపారు. ఆ ఫిర్యాదుపైన కేసు నమోదుచేసి ఎస్సై విచారణ చేపట్టడం జరిగిందని, ఈ విచారణలో ఎఫ్ఐఆర్ లోఉన్న పాత్‌లోత్ విట్టల్ అనే వ్యక్తి చనిపోయాడని తేలిందని వెల్లడించారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరుగుతుందని, విచారణ అనంతరం ఈ కేసుకు సంబంధంలేని వ్యక్తిని లేదా చనిపోయిన వ్యక్తిని తొలగించడం జరుగుతుందని వెల్లడించారు. దీన్ని పాత్‌లోత్ దేవిసింగ్, ఆంజనేయులు సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. పోలీసు వారితో లాలూచీ పడ్డారని ప్రచారంచేయడం జరిగిందన్నారు. వాస్తవానికి దేవిసింగ్, ఆంజనేయులు నావద్దకు వచ్చినప్పుడు కోర్టుద్వారా లీగల్‌గా వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. వారు ఆభూమిలోకి వెళ్లి గుడిసెలు వేశారని ఫిర్యాదుదారుడు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఇంతకుముందే కేసు నమోదు అయిందని మళ్లీ ఎందుకు భూమిలోకి వచ్చారని చెప్పడం జరిగిందన్నారు. పాత్‌లోత్ దేవిసింగ్, పాత్‌లోత్ ఆంజనేయులు భూమి విషయంలో దుష్ప్రచారం చేస్తే భూమి వారికి దక్కుతుందనే ఉద్దేశంతోనే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేశారని సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగంలు పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం

## కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చిన్నకోడూరు, నవంబరు 20, ప్రభాతవార్త:** సిఎంరేవంత్‌రెడ్డి మాజీ సిఎం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై చీటికిమాటికి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని బిఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. చిన్నకోడూరులో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం మొక్క కాదు మహావృక్షమని, కొమ్మను కూడా తాకలేవని హెచ్చరించారు. తెలంగాణకు సంబంధంలేని వ్యక్తి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి అపహాస్యం చేస్తుంది నీవు కాదా అని సిఎంను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుంటే బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా ఎగనామాలు పెడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రానున్న స్థానిక ఎన్నికల్లో బిజెపి సత్తా


కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి ఎన్నికల ఇంచార్జీ మీసాల చంద్రయ్య తదితరులు

**నర్సాపూర్ నవంబరు 20. ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా పనిచేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ సత్తా చాటాలని మెదక్ జిల్లా బిజెపి ఎన్నికల ఇంచార్జ్ మీసాల చంద్రయ్య అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సభ్యత నమోదు, నూతన బూత్ కమిటీ, మండల కమిటీ వర్క్‌షాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ కార్యకర్తలు నాయకులు ముక్తకంఠంతో పనిచేసి బిజెపి పార్టీ సత్తా చాటాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. శక్తి కేంద్రాలు, బూత్ కమిటీ, మండల కమిటీ నాయకులు గ్రామగ్రామాన తిరుగుతూ, మండల కమిటీ సభ్యత నమోదు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్, నాయకులు మల్లారెడ్డి ఉమాశ్రీ, రవి, శ్రీకాంత్‌గౌడ్, రాములునాయక్, సుదర్శన్, అశోక్ షాదుల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

**పెద్దశంకరంపేట, నవంబరు 20 ప్రభాతవార్త:** పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో లబ్దిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నా సంయమనం పాటిస్తూ ప్రభుత్వపథకాల అమలుపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. గతంలో అధికారపార్టీ వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాయని విమర్శించారు, ప్రస్తుతం సిఎం రేవంత్‌రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమపథకాలను అందజేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో దళారులుగా ఉండి కమిషన్‌లు తీసుకొని కళ్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో రఫీఖ్ ఉన్నీసా, తహశీల్దార్ గ్రేసీబాయి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, పెరుమాండ్లు, సత్యనారాయణ, కుంట్ల శ్రీను, చందర్, కుంట్ల సంగయ్య, రాజునాయక్, అంజిరెడ్డి, అనంతరావు, గోవింద్ రావు, సాయిలు ఉన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ చైర్మన్

**గజ్వేల్ టౌన్, నవంబరు 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గౌతి భిక్షపతి అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా భిక్షపతి చేసిన కృషిని గుర్తుచేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు అశోక్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శివమ్మ, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## అడ్డగుట్ట అభివృద్ధికి కృషి

**అడ్డగుట్ట, నవంబరు 20, ప్రభాతవార్త:** అడ్డగుట్ట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. అడ్డగుట్ట సి-సెక్షన్‌లో 6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పవర్ బోర్‌వెల్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగాని మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి సమస్యలు దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్యగౌడ్, ఎల్లయ్య, అమర్, నరిసింగ్, అయోధ్య, దేవయ్య, శంకర్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో యువకులదే కీలక పాత్ర



కార్యక్రమంలో పాల్గొన్న విష్ణు విద్యాసంస్థల సెక్రెటరీ ఆదిత్య విస్సం తదితరులు

**నర్సాపూర్ నవంబరు 20. ప్రభాతవార్త:** దేశాభివృద్ధిలో యువకులదే కీలక పాత్ర అని శ్రీవిష్ణు విద్యాసంస్థల సెక్రెటరీ ఆదిత్య విస్సం అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, ఎన్ని ఆటంకాలు ఎదురైనా, వాటిని అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అదేవిధంగా రవిచంద్రబాబు మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యార్థులతో కలిసి పలు రకాల పరిశోధనలు చేయాలని వారితో కలిసి నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. అందుకు కళాశాల అధ్యాపకుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసిస్టులు వివిధ రంగాలలో రాణించాలి



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న జెఎన్టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తదితరులు

**నర్సాపూర్ నవంబరు 20. ప్రభాతవార్త:** ఫార్మసిస్టులు కేవలం ఫార్మా రంగంలోనే కాకుండా వివిధ రంగాలలో కూడా రాణించాలని అదేవిధంగా ప్రతి ఒక్క విజయవంతమైన ఆసుపత్రి వెనుక ఫార్మసిస్టుల పాత్ర ఉంటుందని జెఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ప్రొఫెసర్ ఫార్మాసిటికల్ సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ ఫినాలే యూఎస్ఏ చంద్రశేఖర్‌లు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని వైపర్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై, ఫార్మసిస్టులు కేవలం ఫార్మా రంగంలోనే కాకుండా వివిధ రంగాలలో కూడా రాణించాలన్నారు. అమెరికాలో ఉన్నటువంటి ఫార్మసీ సిస్టంను ఇండియాలో కూడా అవలంబిస్తే ఇక్కడ కూడా హెల్త్ సొసైటీని మరింత మెరుగుపరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విష్ణు విద్యాసంస్థల సెక్రటరీ ఆదిత్య విస్సం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిని సన్మానించిన బిజెపి నాయకులు


విద్యార్థిని పవిత్రను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**గజ్వేల్, నవంబరు 20 (ప్రభాతవార్త):** ఉత్తరప్రదేశ్‌లో డిసెంబరు 10 నుంచి నిర్వహించే ఎస్‌జిఎఫ్ అండర్-14 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పవిత్రను బిజెపి గజ్వేల్ పట్టణశాఖ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ, చేగుంటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మెదక్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్థానం సాధించడంలో ముఖ్యభూమిక పోషించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు చెప్యాల వెంకట్‌రెడ్డి, నరసింహ, నాయిని సందీప్, మైస విజయ్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కుంకుమ రాణి, ఉపాధ్యక్షురాలు మంతూరి మమత, నాయకులు మఠం మహిపాల్ యాదవ్, పవన్‌కుమార్, దయాకర్‌రెడ్డి, ఏలేశ్వరం ఎల్లం, అశోక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా

**అఫ్జల్‌గంజ్, నవంబరు 20, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని పురానాపూల్ డివిజన్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ అన్నారు. ఈమేరకు పురానాపూల్ డివిజన్ పరిధిలోని ఎస్.వి.ఎన్.నగర్ బస్తీలోని స్కూల్ ప్రహారీగోడ నిర్మాణం తోపాటు కమ్యూనిటి హాల్ నిర్మాణంపై అదనపు శ్లాబ్ నిర్మాణం పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. దాదాపు 20 సంవత్సరాల కాలం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ది పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సదానంద్, డిప్యూటి ఇంజనీర్ సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ పనులు పరిశీలిన

**అడ్డగుట్ట, నవంబరు 20, ప్రభాతవార్త:** బుదవారం అడ్డగుట్ట వెంకట్‌నగర్‌లో వరదనీటి పైప్‌లైన్ పనులను జిహెచ్ఎంసి సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యంతో కలిసి బిజెపి మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గాజుల హంసరాజు పరిశీలించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న పైప్‌లైన్ రెండు పెద్దసైజు క్యాచ్‌పిట్‌లు. వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


కొండపాక బాలురపాఠశాలలో బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

## క్రీడలతో మానసికోల్లాసం

### డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

**కొండపాక, నవంబరు 20, ప్రభాతవార్త :** క్రీడల ద్వారా మానసిక శారీరక ఉల్లాసంతోపాటు ఆరోగ్యం లభిస్తాయని డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జిఎఫ్ క్రీడల జోనల్ స్థాయి బాక్సింగ్ టోర్నమెంటును ప్రారంభిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాక్సింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి అండర్ 14, అండర్ 17, బాలుర, బాలికలు పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం ఎస్.శ్రీనివాస్, పిడి నర్ర భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వంగ మహేందర్‌రెడ్డి, ఉమ్మడి బాక్సింగ్ కోచ్ బహుదూర్ సింగారు శ్రీకృష్ణ, ఎస్‌జిఎఫ్ క్రీడాల జిల్లా కార్యదర్శి సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బ్రాండ్..బిజెపి కార్యకర్తలకేనా...!?

### బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న పచ్చిమట్ల రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 20, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన భారత్ బ్రాండ్ పథకం కేవలం బిజెపి నాయకులకే అందిస్తారా అని బిఎస్పీ నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని బిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం నవంబరు 5వ తేదీన ఈ పథకం ప్రారంభించారని కానీ ఇప్పటివరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఈ పథకం గురించి కనీసం ప్రచారం చేయకపోవడాన్ని ఖండించారు. ఈ పథకం ద్వార పేదలకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకే దొరికే అవకాశం ఉన్నందున ఈ విషయంలో కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకుని పేద ప్రజలకు ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ఎనగందుల శంకర్, వేల్పుల రాజు పాల్గొన్నారు.

## చెకుముకి పోటీలను విజయవంతం చేయాలి

### జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు

**సిద్దిపేట రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కనకరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8,9,10వ తరగతిలో స్కూల్‌లో మొదటి స్థానం పొందిన విద్యార్థులు మండల స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం కోసం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రతి యేటా నిర్వహించడం జరుగుతుందన్నారు. టాలెంట్ టెస్ట్‌కు హెచ్ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు, గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యం సహకరించాలన్నార. చెకుముకి టెస్ట్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. శాస్త్రీయ అధ్యయనం, అలోచన, అచరణ విద్యార్థులు ఎల్లప్పుడు కలిగి ఉండాలన్నారు. జెవివి మంలాల బాధ్యుల చేత సకాలంలో ప్రతి మండలానికి ప్రశ్న పత్రాలు అందజేస్తారని తెలిపారు.

## బాధితుడికి ఎల్ఒసి అందజేత

**కొమురవెల్లి, నవంబరు 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్‌కు చెందిన కుక్కల రాజు అనారోగ్యంతో హైదారాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చిక్సిపొందుతుండగా లక్షలరూపాయాలు ఖర్చు అవుతుండడంతో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా రూ.2 లక్షల ఎల్ఓసి ఇప్పించారని తేలు ఇస్తారి తెలిపారు. బాధితునికి రూ.2 లక్షల ఎల్ఓసి ఇప్పించిన శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్‌కు తేలు ఇస్తారి, పొడిశెట్టి, పిట్ల శ్రీనివాస్, కృష్ణ, చంద్రంగౌడ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప స్వాములకు ప్రతి నిత్యం అన్న ప్రసాదం

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 20, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీనవరత్న దేవాలయంలో అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం నేటి నుండి జనవరి 14వ తేదీ వరకు మణికంఠ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నిత్యం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తామని స్థానిక అయ్యప్ప స్వాములతో పాటు ఇతర గ్రామాల అయ్యప్ప స్వాములు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మణికంఠ ఉత్సవ కమిటీ అధ్యక్షులు సాహితీ రాము గురు స్వామి కోరారు బుదవారం సంగారెడ్డిలోని నవరత్నాలయంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు గురుస్వాములు జయప్రకాశ్, శ్రీశైలం గౌడ్, జనప్రియ రాజు, పరమేశ్వర్ గౌడ్, విశ్వనాథం, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


రాయపోల్ మండల నూతన కమిటీ సభ్యులు

**రాయపోల్, నవంబరు 20 ప్రభాతవార్త :** జనవరి 4,5 తేదీల్లో సిద్దిపేటలో జరిగే తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్, రాయపోల్ మండలాల సెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆనంతరం రాయపోల్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కనకరాజు, ఉపాధ్యాక్షులుగా ఆంజనేయులు, మహేష్, ప్రవీణ్, నాగరాజు, కోశాధికారిగా స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి సత్తయ్య, సహాయ కార్యదర్శిగా కనకయ్య, నర్సింలు, శివానంద్‌లను ఎన్నుకున్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**కంటోన్మెంట్, నవంబరు 20 ప్రభాతవార్త:** ఆడపిల్లల తల్లిదండ్రులకు భారం పడకుండా కళ్యాణలక్ష్మి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 33 మందికి మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మారేడ్‌పల్లి తహశీల్ధార్ బీమయ్యగౌడ్‌తో కలిసి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల సక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలన్నారు.

Main-IV(MDK)-NOV 20:Main-IV(MDK)-NOV 20.qxd 11/20/2024 8:29 PM Page 1



## పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నిజాంపేట్, నవంబరు 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం(ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్)ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాల, కళాశాల ఆవరణను ఎమ్మెల్యే నిశితంగా పరిశీలించడంతో పాటు తరగతి గదులను సందర్శించారు. 8వ తరగతిలోకి వెళ్లిన ఎమ్మెల్యే విద్యార్థులకు గణితంలో పలుప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. పాఠశాలలో భోజన వసతి, తాగునీటి వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌గౌడ్, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు యాదవరెడ్డి, పండరిరెడ్డి, రాధా కిషన్‌సేట్, రమేష్, కృష్ణ, శ్రీకాంత్, శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నాయకుల ముందస్తు ఆరెస్టు



గిరిజనులను ముందస్తుగా అరెస్టుచేసి పోలీసు ఠాణాకు తరలించిన దృశ్యం

**పాపన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా లగచర్లకు బుధవారం ఉదయం గిరిజన నాయకులు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూల్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీ కోసం భూముల విషయంలో గిరిజనులను ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు. స్వంత ప్రయోజనాల కొరకు గిరిజనులను సమస్యలకు గురిచేయడం తగదన్నారు. అమాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో సంఘం నాయకులు విఠల్, అమ్రూ, ప్రకాష్, శక్రు, లోక్యా, తుకారాం, చందర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా కొండపోచమ్మ వార్షికోత్సవ వేడుకలు



కొండపోచమ్మ ఆలయంలో గణపతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, నవంబరు 20 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీకొండపోచమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీ నుండి 22వ తేదీ వరకు మూడురోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో బుధవారం ఉదయం 9గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనము, అఖండదీప స్థాపన, ఋత్విగ్వరణము, అగ్ని ప్రతిష్ఠాపన, మూలమంత్ర హవనము, అభిషేకం తదితర కార్యక్రమాలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. మొదటిరోజు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రవికుమార్ తెలిపారు. అలాగే 21వ తేదీ గురువారం ఉదయం 9.11గంటలకు ప్రాతఃకాల పూజ, హవనము, మూలమంత్ర హోమము, స్థాపిత దేవతాపూజ, సామూహిక కుంకుమార్చన, మంగళహారతి, 22వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సవం, మధ్యాహ్నం 1గంటకు పూర్ణాహుతి, సాయంత్రం 5.30గంటలకు అమ్మవారి సేవాకార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తీగుల్‌నర్సాపూర్ మాజీ సర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్, ఆలయ సిబ్బంది పుల్లం కనకయ్య, పూజారులు గర్నెపల్లి లక్ష్మణ్, గోవర్ధన్, ఐలయ్య, కనకయ్య, తిరుపతి, కొండయ్య, ఆలయ సిబ్బంది హరిబాబు, సుధాకర్, చందు, అంజయ్య, పూజారులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ డైరెక్టర్‌కు కార్యదర్శుల వినతిపత్రం



పంచాయతీరాజ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టిపిఎస్‌ఎఫ్ సభ్యులు

**జగదేవ్‌పూర్, నవంబరు 20 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ సృజన ఐఏఎస్‌ను బుధవారం తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీసభ్యులు హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నాగరాజు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను డైరెక్టర్‌కు వివరించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశామని తెలిపారు. దీనికి డైరెక్టర్ సృజన సానుకూలంగా స్పందించి పంచాయతీరాజ్ యూనియన్లతో త్వరలో సమావేశం ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిపిఎస్‌ఎఫ్ రాష్ట్ర కోశాధికారి శశిధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఆకారపు సురేష్, సిద్ధిపేట జిల్లా కోశాధికారి రాజుగౌడ్, సిద్ధిపేట, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 20 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని స్థానిక అథ్లెటిక్స్ స్టేడియంలో ఉదయం 9గంటలకు 10వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అండర్-8, 10, 12 బాలబాలికలకు మెదక్ జిల్లాస్థాయి ఎంపికలు జరుగుతాయని మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటరమణ, ఎ.మధుసూదన్‌లు తెలిపారు. వివిధ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని, డిసెంబర్‌లో మంచిర్యాలలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. ఉత్తమప్రతిభ కలిగిన క్రీడాకారులు మెదక్ జిల్లా తరపున పాల్గొంటారని, క్రీడాకారులు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని తమవెంట తీసుకురావాలని వివరించారు. ఇతర వివరాలకు 9963005540 నెంబర్‌లో సంప్రతించాలని తెలిపారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 20 ప్రభాతవార్త:** విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారంరోజుల పాటు పండుగ వాతావరణంలో వారోత్సవాలు జరుపుకోవడం జరిగిందన్నారు. మనుషుల నుంచి దోచుకోనిది ఒక్క పుస్తకం అందించే విజ్ఞానం మాత్రమేనని తెలిపారు. గతంతో పోలిస్తే పుస్తకాల ముద్రణ వల్ల జ్ఞానాన్ని పెంచుకునే వారి సంఖ్య పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై చదువు పట్ల ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిపారు. అయితే పుస్తకాలు కేవలం ఉద్యోగం చేసి సంపాదించేందుకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని నేటి సమాజం అభిప్రాయపడటం బాధాకరమన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు భగవద్గీత చదవడం అలవాటు చేసుకోవడం వల్ల విజ్ఞానంతో పాటు తెలివిని పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా గ్రంథాలయంలో 27వేల రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేస్తానని తెలిపారు. అనంతరం మెదక్ ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ మనిషి మేధస్సును పెంచే పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, యువతకు అవసరమైన అన్ని సౌకర్యాలు గ్రంథాలయంలో ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత ఉపయోగించుకోవాలని తెలియజేశారు. డిఈవో రాధకిషన్ మాట్లాడుతూ జ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పుస్తకాలు కొనుగోలు చేయలేని నిరుద్యోగ యువత కోసం తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాలను నిర్మించి పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థిదశ నుంచే పఠనాసక్తిని కల్పించేందుకు గ్రంథాలయాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, డిఈవో రాధకిషన్, ఇంటర్ నోడల్ అధికారి మాధవి, ఎంఈవో నీలకంఠం, వైద్య శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వంశీ కృష్ణ, మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, పిడి రాజేందర్, అర్చన, మమత, వాణి తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 20 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులకు పఠనాసక్తిని, గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు తెలిపినట్లు వివరించారు. సమాజంలో గ్రంథాలయాల పాత్రను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జి డాక్టర్ సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ తిరుమలరెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ వామనమూర్తి, వెంకటేశ్వర్లు, డాక్టర్ విశ్వనాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల తీరుపై కళాయాత్ర



కళాయాత్ర నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను చైతన్యం చేయడానికి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజాపాలన కళాయాత్ర నిర్వహిస్తున్నారు. హవేలి ఘనపూర్ మండలంలో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల కళాయాత్ర జిల్లా పాలనాధికారి ఆదేశానుసారం సమాచారశాఖ జిల్లా పౌరసంబంధాల అధికారి ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సమన్వయంతో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు వివిధపాటల రూపంలో విస్తృతప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన యేడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ఆరు గ్యారెంటీ పథకాలఅమలు తీరును కళాకారులచే ప్రభుత్వ సంక్షేమకార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయడంలో జిల్లాలో మండలాల వారీగా కళాయాత్ర కొనసాగుతుంది. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ సిద్ధులు, సంబంధిత సాంస్కృతిక సారథి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లవల్లిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహావిష్కరణ

**రామచంద్రాపురం, నవంబరు 20, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో బుధవారం శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి బిఆర్‌ఎస్ నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఆలయంలో ఆదర్శ్‌రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మడిదల బిఆర్‌ఎస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు జగన్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల ముందస్తు అరెస్టు



గిరిజనులను ముందస్తుగా అరెస్టుచేసి ఠాణాకు తరలించిన దృశ్యం

**సిర్గాపూర్, నవంబరు 20, ప్రభాతవార్త:** గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండించేందుకు, గిరిజనులకు మద్దతుగా నిలిచేందుకు వికారాబాద్ జిల్లా లగచర్లకు వెళుతున్న గిరిజన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసు ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థిసంఘం మండలాధ్యక్షులు హరలాల్ రాథోడ్, నాయకులు రమేష్ నాయక్‌లు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన గిరిజనులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అక్రమ అరెస్టులు సరికాదు



చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న మండల ఎస్టి నాయకులు

**చిన్నశంకరంపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం సరికాదని మండల ఎస్టి నాయకులు అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లకు వెళ్తున్న మండల ఎస్టి నాయకులను చిన్నశంకరంపేటలో పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించిన వారి గొంతు నొక్కినంత మాత్రాన ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. రాజకీయ లబ్ది కోసమే రైతులను మోసంచేసి వారి భూములను స్వాధీనం చేసుకొని ఫార్మా పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకుంటున్నారని, ఈ విషయంలో రైతులకు అండగా ఉంటామన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. వీరికి బిఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు సంఘీభావం తెలిపారు. సుధాకర్ నాయక్, రమేష్ నాయక్, శ్రీను నాయక్, మోతీలాల్‌లు ఉన్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠ

**గుమ్మడిదల, నవంబరు 20 ప్రభాతవార్త:** మాతవాడల్లో నూతన దేవాలయం నిర్మాణం చేపట్టి వేద బ్రాహ్మణులచే రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్‌రెడ్డి, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్‌లు హాజరయ్యారు. బిఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను నిర్వహించిన ఎంపిటిసి పదవీకాలంలో నల్లవల్లి, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాలలో ఎంతో అభివృద్ధి చేయడంతో పాటు ఎన్నో ఆలయాల నిర్మాణం చేపట్టి ఆయా దేవాలయాలను ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుపుకున్నామని, గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలో భక్తులకోరిక మేరకు నూతన దేవాలయ నిర్మాణాన్ని చేపట్టి ఎల్లమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్థుల సమక్షంలో అంగరంగవైభవంగా నిర్వహించుకున్నామని అన్నారు. కళాకారులరు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోమడుగు శంకర్, గడ్డం హనుమంత్ రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దయానంద్, మాజీ వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, మహిళలు, భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి

-బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



విలేఖరులతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

**రామచంద్రాపురం, నవంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ ద్రోహి సిఎం రేవంత్‌రెడ్డి అని, కాళోజీ చెప్పినట్లుగా మోసం చేస్తే పాతిపెట్టాలంటే ముందుగా రేవంత్‌రెడ్డిని పాతిపెట్టాల్సి ఉంటుందని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి వరంగల్ బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలపై బుధవారం రామచంద్రాపురంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో స్పందించారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ తెలంగాణసాధన కొరకు పోరుయాత్ర చేసింది కిషన్ రెడ్డి అని, పార్లమెంట్‌లో బిల్లు పాస్ అయ్యేందుకు నిరాహారదీక్ష చేసింది కిషన్ రెడ్డి అని, నాడు జెఎసిలో భాగంగా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నది కిషన్ రెడ్డి అని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడో అందరికీ తెలుసని, ఏనాడైనా జై తెలంగాణ అన్నావా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ కారులపై తుపాకీ ఎత్తిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు తెలంగాణ గురించి మాట్లాడటం వింతగా ఉందని దుయ్యబట్టారు. పూటకో పార్టీ మారిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని ఆరోపించారు. 1300మంది చితిమంటలపై నిప్పులు కాచుకుంది కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. కిషన్‌రెడ్డిపై ఆరోపణలు చేసే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి భారతీనగర్ డివిజన్ అధ్యక్షులు నందారెడ్డి మల్లేష్, నాయకులు భూపాల్‌రెడ్డి, రాజు, పంటరెడ్డి, రమేష్ గుప్తా, బిజెపి పదాధికారులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**సిర్గాపూర్, నవంబరు 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంతమేర కడ్త తీస్తున్నారో అని రైతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కల్గకుండా నిర్వాహకులు తగుచర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన చివరిగింజ వరకు కొనుగోలు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఐకెపి అధికారులు యాదవరెడ్డి, మధుసూదన్, మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, నారాగౌడ్, సంగమేశ్వర్ సేట్, పరుమాళ్ గౌడ్, కృష్ణ, సంగ్రామ్, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర సర్వే



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే వివరాల నమోదును బుధవారం మండల తహసీల్దార్ మన్నన్ మిర్జాపల్లి తండాలో పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో అధికారులు సూచనలు పాటిస్తూ, ఎన్యుమరేటర్లు విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం చిన్నశంకరంపేట పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**నిజాంపేట్, నవంబరు 20, ప్రభాతవార్త:** సిర్గాపూర్, కల్హేర్ మండలాల లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సిర్గాపూర్ మండలానికి సంబంధించి 25మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు అందచేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని గుర్తుచేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు మూడు సంవత్సరాల వరకు చెక్కులు అందేవి కావని, కాంగ్రెస్ వారికి చెక్కులు అందించకుండా ఇబ్బంది పెట్టేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ హయాంలో వివాహం జరిగిన 5, 6 నెలల్లోనే చెక్కులు అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపిడిఓ మల్సూర్ నాయక్, మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, రవి పాటిల్, తేజరావు, జమీల్, కృష్ణ, మోహన్‌రెడ్డి, జైరాజ్, యం.తుకారాం, పండరిరెడ్డి, ప్రకాష్ పాటిల్, విఠల్‌రెడ్డి, పండరి పాటిల్, గంగారాం, తుకారాం నాయక్, సంగ్రామ్ నాయక్, రాం కిషన్, బండారి సాయిలు, సున్నపు నాగయ్య, హుస్సేన్, కోడి గంగారం, సాయిలు, ముంతాజ్ సేట్, వీరచారి, బాల్‌రెడ్డి, అబ్రహాం, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండుగలా మహాపడిపూజ

**అమీన్‌పూర్, నవంబరు 20 ప్రభాతవార్త:** వేలాది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీ మారుమ్రోగింది. అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నరసింహాగౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ కాలనీలోని తన నివాసం వద్ద బుధవారం 13వ శ్రీఅయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవం కన్నులపండుగలా నిర్వహించారు. శ్రీశ్రీ మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజారులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహీపాల్‌రెడ్డి అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వేలాది భక్తులకు అన్నదాన కార్య క్రమం ఏర్పాటు చేశారు.

## రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం తగదు



దేవాలయం ప్రధాన రహదారిని చూపిస్తున్న నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి

**పటాన్‌చెరు, నవంబరు 20, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ దేవాలయం ప్రధాన రహదారి రోడ్డును తవ్వి సుమారు 20రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ రోడ్డుపనులు ప్రారంభించలేదు. ఈవిషయమై బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారును ఫోన్‌లో సంప్రతించగా ఇది తనదృష్టిలో లేదని సమాధానం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నాయకులు ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు, బొల్లారం నుండి బాచుపల్లి, మల్లంపేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి మీదుగా నిత్యం వేలమంది ప్రయాణాలు సాగిస్తారని, బొల్లారం మున్సిపల్ కమిషనర్‌కు ఈ రోడ్డు నిర్మాణం గురించి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆనంద్ కృష్ణారెడ్డి ఆరోపించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనుల గురించి కమిషనర్‌కు సరైన అవగాహన లేకపోవడం నిజంగా దురదృష్టకరమని, అధికారులు మొద్దునిద్ర వీడాలని అయన హితవు పలికారు. ఇప్పటికైనా కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి రోడ్డునిర్మాణం పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన చేపడుతామని ఆయన డిమాండ్ చేశారు.

## మతిస్థిమితం లేని వృద్ధుడి ఆత్మహత్య

**పాపన్నపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** మతిస్థిమితం లేని వృద్ధుడు ఉరిపెట్టుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చెనపల్లి గిరిజన తండాలో మంగళవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. కుటుంబీకులు, పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... పొడ్చెనపల్లి తండాకు చెందిన పల్యా బద్య నాయక్ (68) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. గత కొన్నినెలల క్రితం పల్యా బద్ద నాయక్ చిన్నకుమారుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. నిత్యం కొడుకు ఉరివేసుకున్న చెట్టువద్దకు వెళ్లి కొడుకు జ్ఞాపకాలను నెమరేసుకుంటూ బాధపడుతుండేవాడని, ఇదేక్రమంలో మానసికస్థితి కోల్పోయాడన్నారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి చీకటిపడినా రాకపోవడంతో కుటుంబీకులు ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కొడుకు ఆత్మహత్య చేసుకొన్న చెట్టువద్దకు వెళ్లి పరిశీలించగా బద్య నాయక్ చెట్టుకు వేలాడుతూ కానరావడంతో పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి పెద్దకొడుకు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ సంగన్న తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

**మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 20 ప్రభాతవార్త:** హవేలి ఘనపూర్ మండలం ఫరీద్‌పూర్ సమీపంలో మంగళవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి జక్కన్నపేట గ్రామానికి చెందిన ప్రభాకర్, మహేష్ అనే యువకులు మృతిచెందిన విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి బుధవారం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో మృతదేహాలను సందర్శించారు. మృతిచెందిన యువకుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు రూ.10వేల ఆర్థికసహాయం అందజేశారు. చిన్న వయస్సులో ఇద్దరు యువకులు మరణించడం చాలా బాధాకరమన్నారు. వీరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట మెదక్ పట్టణ బిఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్, మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, జక్కన్నపేట మాజీ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**న్యాల్‌కల్, నవంబరు 20, ప్రభాతవార్త:** కుటుంబ సమస్యలతో సతమతమవుతూ జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని రాజోలా గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చల్ల రాజశేఖర్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. పోలీసు ఠాణా పరిధిలోని రాజోలా గ్రామానికి చెందిన మొల్లవాలె సమీర్ (17) తండ్రి 8నెలల క్రితం చనిపోయాడన్నారు. గతంలో తనబావ సైతం చనిపోవడంతో అక్క విధవరాలుగా మారింది. కావాల్సినవారు కానరాని లోకాలకు చేరిపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఈ నెల 15న మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో తనపొలం వద్ద పురుగులమందు సేవించటంతో, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్థుల సహకారంతో కర్ణాటకలోని బీదర్ పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ సోమవారం రాత్రికి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి మొల్లవాలె షబానా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ వివరించారు.

## నీట మునిగి వ్యక్తి మృతి

**నర్సాపూర్ రూరల్, నవంబరు 20, ప్రభాతవార్త:** ట్రాక్టర్ అదుపుతప్పి నీటమునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన రుస్తుంపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం, మండల పరిధి రుస్తుంపేట గ్రామానికిచెందిన పులిమేటి రమేష్ (26), వారంరోజులుగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను నడుపుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డులో వేసి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామంలో ఉన్న కనకల్లా చెరువుకట్టపై ట్రాక్టర్ అదుపుతప్పి చెరువులో పడటంతో నీట మునిగి అక్కడికక్కడే చనిపోయాడు. తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.